జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 22-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 735 పేజీలు: 4 వెల : రూ.7



# కబళిస్తున్న..

✳ రోజురోజుకూ పెరుగుతున్న కిడ్నీ మరణాలు ✳ కిడ్నీవ్యాధితో ఆసుపత్రుల్లో పోరాడుతున్న ఉద్దానవాసులు ✳ లక్షలు ఖర్చవుతున్నా.. నిలవని ప్రాణాలు ✳ ఒకేరోజు కిడ్నీవ్యాధితో లోహరిబంద పంచాయతీలో ఇద్దరు మహిళలు మృతి ✳ విషాదంలో ఉద్దానం ✳ కిడ్నీ భూతం నుంచి శాశ్వత ఉపశమనం ఎప్పుడా అని ఎదురుచూస్తున్న ఉద్దానవాసులు ✳ కొందరు ఈ వ్యాధి బారిన పడకుండా ఉద్దాన ప్రాంతాన్ని వదిలేస్తున్న వైనం

# కిడ్నీ మహమ్మారి

మందస, జులై 21(వార్త): ఉద్దానంలో కిడ్నీవ్యాధి కన్నీటి గాధకు ముగింపు దొరకడంలేదు. ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రతీ రోజూ ఎక్కడో.. ఒక దగ్గర కిడ్నీ వ్యాధి మరణం జరుగుతునే ఉంది. ఉద్దానం కిడ్నీ మరణాలకు శాశ్వత పరిష్కారం దొరకకపోవడంతో ఒక్కో రోజూ రెండు నుంచి మూడు, నాలుగు మరణాలు కూడా జరుగుతున్నాయి. కిడ్నీ వ్యాధి సోకి రూ.లక్షలు పోగొట్టుకుని, ఆపై ప్రాణాలు కూడా కోల్పోయి ఉద్దానం కన్నీరు, మున్నీరుగా విలపిస్తోంది. బాధిత కుటుంబాల్లో విషాదం నింపుతోంది. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని లోహరిబంద పంచాయతీలోని ఇద్దరు మహిళలు కిడ్నీవ్యాధితో ఒక్క రోజే మరణించడంపై ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. లోహరిబంద పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన డి.దాలమ్మ(41) అనే వివాహిత కిడ్నీవ్యాధితో బాధ పడుతూ మరణించారు. నిరుపేద కుటుంబానికి చెందిన దాలమ్మకు భర్త పాపారావు, ఇద్దరు కుమార్తెలు అశ్వని, భారతి ఉన్నారు. దాలమ్మ వైద్యానికి నిరుపేద కుటుంబం అయినప్పటికీ, రూ. లక్షలు వ్యయం చేశారు. ఇటు రూ.లక్షలు పోయాయి.. అటు ప్రాణాలు కూడా దక్కకపోవడంతో దాలమ్మ కుటుంబం కన్నీరు, మున్నీరుగా విలపిస్తోంది. దాలమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా.. లోహరిబంద పంచాయతీలోని గజ్జివానిపేట గ్రామానికి చెందిన అందాల కళావతి(55) కూడా కిడ్నీ వ్యాధితో మరణించారు. సుమారు మూడు సంవత్సరాలుగా కళావతి కిడ్నీవ్యాధితో బాధ పడుతున్నారు. ఈమె వైద్యానికి కూడా ఆ కుటుంబం రూ.లక్షలు వ్యయం చేసింది. డయాలసిస్ వరకు పరిస్థితి చేరుకుంది.





చివరకు కిడ్నీవ్యాధితో పోరాడుతూ కళావతి మరణించింది. భర్త తరిణయ్య, కుమారుడు హేమసుందర్, కుమార్తె త్రివేణి ఉన్నారు. కళావతి కిడ్నీవ్యాధితో మరణించడంతో కళావతి కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించింది. ఒకే పంచాయతీకి చెందిన ఇద్దరు మహిళలు కిడ్నీవ్యాధితో మరణించడంతో ఉద్దానంలో విషాదం చోటు చేసుకుంది. కొందరైతే ఈ కిడ్నీ భూతానికి భయపడి ప్రాణాలు అరచేత పట్టుకొని ఉద్దాన ప్రాంతాన్ని వదిలేసి వెళ్లిపోతున్నారు. ఈ కిడ్నీ వ్యాధి మరణాలకు అంతమే లేదా.. అంటూ ఉద్దానం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఉద్యానవన శాఖ మాజీ ఏపీడీ చుట్టూ..

# బిగుస్తున్న ఉచ్చు!



✳ ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో విచారణాధికారి మార్పు ✳ ఎట్టకేలకు కదిలిన ఏసీబీ ఫైలు ✳ ఏపీఎంఐపీ మాజీ ఏపీడీ ఆర్వీవీ ప్రసాద్‌పై శాఖాపరమైన విచారణ ముమ్మరం ✳ జాయింట్ డైరెక్టర్‌కు విచారణ బాధ్యతలు ✳ ప్రజెంటింగ్ ఆఫీసర్‌గా సీఐ ✳ మూడు నెలల్లో పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశాలు

శ్రీకాకుళం/అమరావతి, జులై 21 (వార్త): ఆదాయానికి మించిన ఆస్తుల కేసు ఎదుర్కొంటున్న శ్రీకాకుళం ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు (మాజీ ఏపీడీ, ఏపీఎంఐపీ) రత్నాల వేంకట వరప్రసాద్‌పై చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆయనపై గతంలో నమోదైన అక్రమాస్తుల కేసులో శాఖాపరమైన విచారణను ప్రభుత్వం ఎట్టకేలకు తీవ్రతరం చేసింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ ఫైలుపై స్పందించిన ప్రభుత్వం, కమిషనరేట్ ఆఫ్ ఎంక్వైరీస్ నుంచి విచారణను వెనక్కి తీసుకుంటూ మంగళవారం సంచలన ఉత్తర్వులు (జీవో ఆర్ టి. 663, 664) జారీ చేసింది. గతంలో ఈ విచారణ కమిషనరేట్ ఆఫ్ ఎంక్వైరీస్‌లో నలుగుతుండగా, తన ప్రమోషన్‌కు అడ్డంకిగా మారిందని, విచారణ వేగవంతం చేయాలని కోరుతూ ఆర్వీవీ ప్రసాద్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఈ విచారణ ప్రక్రియను వాయిదాలు వేయకుండా నిర్ణీత వ్యవధిలో (మూడు నెలల్లో) కచ్చితంగా పూర్తిచేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. విచారణాధికారిగా అమరావతి తోటబడి, పట్టు పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ పి.హనుమంతరావును నియమించింది. ప్రభుత్వ పక్షాన ఆరోపణలను రుజువు చేసేందుకు, ఆధారాలను విచారణాధికారి ముందు నిలబెట్టేందుకు విజయనగరం రేంజ్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎం.మహేశ్వరరావును నియమిస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వ్యవధిలోనే విచారణ పూర్తిచేసి తుది నివేదిక అందించాలని విచారణాధికారిని ఆదేశించారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

*** ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు చావలి శ్రీనివాస్**



**మందస, జూలై 21(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష రద్దు చేయాలని, గత వేసవి సెలవుల్లో బదిలీలు చేయకపోవడం వలన ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రమోషన్స్ కూడా ఇవ్వకపోవడం దారుణమని ఏపీటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు చావలి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ మందస శాఖ ఆధ్వర్యంలో మందస మండలంలో హరిపురం, డబారు, జిల్లుండ, డిమిరియా, జీఆర్ పురం, కుంటికోట, పిడిమందస, మధ్య, దేవుపురం, ఛత్రపురం, కిల్లోయి, బీపీ, కృష్ణాపురం, చిన్న కోష్ట తదితర పాఠశాలలను సందర్శించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సేకరించారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు వెంటనే టెట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పిఆర్సి కమిషన్ను నియమించి ఉద్యోగ ఉపాధ్యాయులకు 30% మధ్యంతర భృతి ప్రకటించాలని, ఇంతవరకు బకాయి ఉన్న ఐదు విడతల విడుదల చేయాలని, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పూర్తిగా అందలేదని, వెంటనే విద్యార్థులకు అవసరమైన వస్తువుల సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుని విద్యారంగాల సమస్యల పరిష్కారానికి ఉద్యమమే శరణ్యం అన్నారు. గిరిజన ప్రాంతాలలో ఆశ్రమ పాఠశాలలకు పూర్తిస్థాయిలో రెగ్యులర్ వార్డెన్ ను మరియు విద్యార్థుల ఆరోగ్య సేవ నిమిత్తం రెగ్యులర్ ఏ ఎన్ ఎం ను నియమించాలని, డిమాండ్ చేశారు. పర్యటనలో జిల్లా అధ్యక్షుడు చావలి శ్రీనివాస్ తో పాటు జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, రాష్ట్ర కౌన్సిలర్ బల్ల సుభాష్ బాబు, మండల శాఖ అధ్యక్షుడు బి బైరాగి, మండల శాఖ ప్రధాన కార్యదర్శి బి.రామారావు, ఎస్.నారాయణరావు, సింహాచలపతి, డి.చంద్రశేఖర్, ఎస్.కిరణ్ కుమార్, బి.తిరుపతిరావు, ఎస్ కె హమీద్ తదితరులు పాల్గొన్నారు.



## గుంతను తవ్వారు..
# పూడ్చకుండా వదిలేశారు!

**ఆమదాలవలస, జూలై 21 (వార్త):** ఆమదాలవలస మున్సిపాలిటీలో గేటు నుంచి అండర్గ్రౌండ్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో పైప్‌లైన్ లీకేజీ మరమ్మతుల కోసం నెల రోజుల క్రితం తవ్విన గుంతను ఇప్పటికీ పూడ్చకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో సరైన హెచ్చరిక బోర్డులు, రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో పలువురు ప్రమాదకరంగా గుంతలో పడిపోతున్నారు. గుంతకు ఎదురుగా నివసిస్తున్న ఓ దివ్యాంగుడు, గుంత కారణంగా తన ఇంట్లోకి వెళ్లడం కూడా చాలా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పైప్‌లైన్ లీకేజీని సరిచేసినప్పటికీ, తవ్విన గుంతను మాత్రం పూడ్చకుండా అలాగే వదిలేయడంపై స్థానికులు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని విమర్శిస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు.ప్రజల భద్రత దృష్ట్యా వెంటనే స్పందించి గుంతను పూడ్చి రహదారిని యథాస్థితిగా అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు మున్సిపల్ కమిషనర్‌ను కోరుతున్నారు.

## ఏఐకేఎంఎస్ జిల్లా మహాసభలను
# విజయవంతం చేయండి



**మెళియాపుట్టి, జులై 21 (వార్త):** శ్రీకాకుళంలో కళింగ భవన్లో ఈనెల 25న జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా 11వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐకెఎంఎస్ నాయకులు సవర బంగ్లా కుమార్, అరుణోదయ సంస్కృతి సమైక్య జిల్లా కార్యదర్శి కె. సోమేశ్వరరావు, మాజీ సర్పంచ్ భాస్కర్ రావు తదితరులు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో మంగళవారం నాడు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా మహాసభల కరపత్రాన్ని సైతం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ జిల్లా విభజనలో కోల్పోయిన ఐటిడిఏ ను శ్రీకాకుళం జిల్లాలో మెళియాపుట్టి కేంద్రంగా ఐటిడిఏను మంజూరు చేయాలని, ఆదివాసి గ్రామాలను ఐదవ షెడ్యూల్లో చేర్చాలని, 1 /70 చట్టాన్ని అమలు చేయాలని, డిమాండ్ చేస్తూనే రైతాంగ సమస్యలు, ఆదివాసి సమస్యలు, దళిత పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత రైతుకూలీ సంఘం పనిచేస్తుందని తెలియజేస్తూనే జరగనున్న ఈ మహాసభల్లో జిల్లాలో ఉన్న సమస్యలతో పాటు మెళియాపుట్టి మండలంలో ఉన్న రైతాంగ సమస్యలపై చర్చించి తీర్మానాలను చేసి భవిష్యత్ కార్యచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఆదివాసీల పోడు భూములకు పట్టాల కోసం అనేక ఉద్యమాలను చేసిందని గుర్తు చేశారు. ఈ మహాసభలలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు మంగళవారం నాడు మండలంలో పలు గ్రామాల్లో పర్యటిస్తూ ఏఐఎంఎస్ కార్యవర్గ సభ్యులు, సవర బంగ్లా కుమార్, అరుణోదయ సాంస్కృతి సమాఖ్య జిల్లా కార్యదర్శి కె. సోమేశ్వర రావు, ముకుందాపురం మాజీ సర్పంచ్ ఎస్. భాస్కర రావు, ఎస్.అప్పలస్వామి, నూకయ్య, అర్జున్ రావు, తదితరులు ఉన్నారు.

## చిరు వ్యాపారులకు అండగా
# లయన్స్ క్లబ్

*** ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వజ్జ బాబూరావు * చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ**

**పలాస, జులై 21 (వార్త):** చిరు వ్యాపారుల సంక్షేమమే సమాజ అభివృద్ధికి పునాదని ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వజ్జ బాబూరావు పేర్కొన్నారు. పలాస క్యాజు ల్యాండ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు ఉచితంగా గొడుగులు మంగళవారం పంపిణీ చేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వజ్జ బాబూరావు వర్తకులకు గొడుగులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు, వర్షాలు లెక్కచేయకుండా జీవనోపాధి కోసం వీధుల్లో వ్యాపారం చేసే చిరు వర్తకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాంటి వారికి రక్షణగా నిలిచే గొడుగులను అందించడం అభినందనీయమైన సేవా కార్యక్రమమని పేర్కొన్నారు. సమాజంలోని వివిధ వర్గాల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు చేపడుతున్న లయన్స్ క్లబ్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో మానవతా విలువలు మరింత బలోపేతం అవుతాయని, ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అవసరమైన సమయంలో సేవ చేయడం గొప్ప దాతృత్వమని, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి. శివకుమార్ మాట్లాడుతూ సామాజిక సేవే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా విద్య, వైద్యం, పర్యావరణం, పేదల సంక్షేమం వంటి రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి. శివకుమార్, కార్యదర్శి ఎం. కామేశ్వరరావు, ట్రెజరర్ వి. రామారావు, సభ్యులు శివానంద స్వామి, వెంకటరాజు, నాగేశ్వరరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ కళ్లను జాగ్రత్తగా ఉంచుకోవాలి




**మందస, జులై 21(వార్త):** ప్రతి ఒక్కరూ కళ్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.మౌనిక, ఆప్తాలమిక్ రోణంకి వెంకటరమణ అన్నారు. మందస పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40సంవత్సరాలు దాటిన ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించాకోవాలన్నారు. అన్ని రకాల నేత్ర సంబంధించిన శస్త్ర చికిత్సలు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా జరుగుతాయన్నారు. ప్రతీ ఒక్కరు కంటి సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ, శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆప్తాలమిక్ బి.దినేష్ కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 52మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 23మందిని కేటరక్ట్ సర్జరీకు శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. రోగులకు ఉచిత వాహన, భోజన సదుపాయశీ కల్పించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు జూనియర్ మేనేజర్ టి.రామారావు, పీహెచ్‌సీ హెల్త్ విజిటర్ టీవీ భారతి, ఫార్మసీ ఆఫీసర్ వి.శైలజ, నర్సింగ్ ఆఫీసర్ జి.ఆనంద్, ల్యాబ్ సహాయకురాలు హెచ్.సుజాత, సీనియర్ సహాయకుడు ఎం.శ్రీనివాసరావు, ఆఫీస్ సబార్డినేట్ టి.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నర్తు వెంకటరమణ కుటుంబానికి సహాయం



**మందస, జులై 21(వార్త):** మందస మండలంలోని లొహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న నర్తు వెంకటరమణ స్నేహితుడు రెంటికోట గ్రామం పలాస మండలానికి చెందిన న్యాయవాది మనుయాదవ్ 15వేల రూపాయలతో పాటు నిత్యావసర వస్తువులు, 25కిలోల బియ్యం, మూడు శారీలు వెంకటరమణ కుటుంబ సభ్యులకు అందజేశారు. వెంకటరమణకు జరిగిన ఘోరాన్ని తలచుకొని బాధ ఆయన పడ్డారు. ఒక లాయర్ గా మీకు ఏ అవసరం వచ్చినా నా సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. అలాగే అందరూ ఆ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. మనుయాదవ్ గతంలో ఉద్దాన ప్రాంతంలో మెడికల్ క్యాంప్, ఐ క్యాంప్, బ్లడ్ క్యాంప్ వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో అడ్వకేట్ మనుయాదవ్, వేణుకుమార్, సాయికుమార్, గొరకల పాపారావు పాల్గొన్నారు.

# మానవాళి మనగడకు మొక్కలే జీవనాధారం



**మందస, జులై 21(వార్త):** గో గ్రీన్ సంస్థ, ఎస్ఎంఆర్ ఫౌండేషన్ సంయుక్త సారథ్యంలో నిర్వహించబడుతున్న మొక్కల నాటడం, సంరక్షణ కార్యక్రమంలో మందస ఎంపీడీఓ వై.వెంకటరమణ మెయిన్ రోడ్డులో గల బజారు జంక్షన్ వద్ద మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయిమోహన్ రిసోర్సెస్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఐరన్ గార్డును మొక్కకు అమర్చారు. అనంతరం గిన్ని తిరుపతిరెడ్డి, వడ్డి చంద్రశేఖరరావు, కంచి బెహరా, ఇప్పిలి కేశవరావు తదితరులు మొక్కలు నాటారు. దొండపర్తి ప్రసాదు, వడ్డి చంద్రశేఖరరావుల సహకారంతో ఏర్పాటు చేసిన మరికొన్ని ఐరన్ గార్డులను గయా సంతు, నిరంజన బెహరా, రాము నెపాక్ తదితరులు మొక్కలకు అమర్చారు. ఈ సందర్భంగా మందస మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటరమణ మాట్లాడుతూ నాటిన మొక్కలు పెరిగి పెద్దయ్యాక పర్యావరణ, జీవ మనుగడకు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి సమాజ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలు చూడడం కూడా గొప్ప విషయమని పేర్కొంటూ.. గో గ్రీన్ సంస్థ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. డివైడర్లను పరిశుభ్రంగా ఉంచడం ఒక్క పారిశుద్ధ్య కార్మికుల వల్ల సాధ్యం కాదంటూ, వారు చెత్తను మాత్రమే తొలగించగలరని, వాటిని పరిశుభ్రంగా ఉంచే అవగాహన చైతన్యం ప్రజలకు కల్పించినప్పుడే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్ పాడి, మామిడి కోదండరావు, శివకుమార్, పూర్ణ చందు మహారణ, బుడకల రామారావు, నూకల వెంకయ్య, వొంటేరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాంధ్ర సంస్కృతిని కాపాడుకుందాం



**మందస, జులై 21(వార్త):** ఉత్తరాంధ్ర సంస్కృతిని కాపాడుకుందామని ప్రజా కళామండలి నాయకులు కొర్రాయి నీలకంఠం, అమ్మరామకృష్ణ, బత్తిన లక్ష్మణ్ అన్నారు. మందస మండలంలోని హరిపురంలో ఉత్తరాంధ్ర సంస్కృతిని కాపాడుకుందాం అంటూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సంస్కృతిని కాపాడుకుందామని, జానపదం పేరుతో కొనసాగుతున్న అశ్లీల సాహిత్యాన్ని వ్యతిరేకిద్దామని, ప్రజా కళలను పరిరక్షిద్దాం అంటూ పిలుపునిచ్చారు. ఆగస్టు 4న వజ్రపుకొత్తూరు మండలంలోని పల్లిసారధి గ్రామంలో ఉత్తరాంధ్ర సంస్కృతిని కాపాడుకుందాం-జానపదం పేరుతో కొనసాగుతున్న అశ్లీల సాహిత్యాన్ని వ్యతిరేకిద్దా-ప్రజా కళలను పరిరక్షిద్దాం అనే సందేశంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కొర్రాయి నీలకంఠం, ఉత్తరాంధ్ర ప్రజా గొంతుకగా గుర్తింపు పొందిన అమ్మరామకృష్ణ లు బత్తిని లక్ష్మణ్‌కు ఆహ్వానం పలికారు. అణగారిన ప్రజల జీవితాలను తన పాటల ద్వారా ప్రతిబింబించి, ప్రజల గొంతుకగా నిలిచిన వంగపండు ప్రసాదరావు స్మరించుకోవడం అంటే జానపదాన్ని, ప్రజా సంస్కృతిని పరిరక్షించుకోవడమే అని ఉత్తరాంధ్ర ప్రజా గొంతుక భావిస్తోందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజా కళలను భావితరాలకు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వారు కోరారు.

## ఉచిత కంటి వైద్య పరీక్షలు

**ఎల్ఎన్‌పేట, జులై 21 (వార్త):** లక్ష్మీనర్సుపేట మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె.ఈశ్వరరావు పాల్గొని విద్యార్థుల చూపును క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన వారికి తగిన సూచనలు, సలహాలు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లయన్ ఎం.కె. మిశ్రో మాట్లాడుతూ చిన్నతనంలోనే కంటి సమస్యలను గుర్తించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎన్. రామారావు, ఏఎన్ఎమ్ కె. రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు కె.లక్ష్మి, బి. జయ లక్ష్మిలతో పాటు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అప్పలరాజు కుటుంబంపై అక్రమ కేసులు తగదు

*** న్యాయవాది దున్న లోకనాథం**



**మందస, జులై 21(వార్త):** అప్పలరాజు కుటుంబంపై అక్రమ కేసులు తగదని న్యాయవాది దున్న లోకనాథం అన్నారు. మందస మండలంలోని హరిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర మాజీ మంత్రి, వైసిపి నేత డాక్టర్ సిదిరి అప్పలరాజు కుమారుడు చేసిన బైక్ ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య అనే వ్యక్తి మృతి చెందడంతో, ఆ ఘటనను రాజకీయ ఆయుధంగా మార్చి అప్పలరాజు కుటుంబంపై అక్రమ కేసులు బనాయించారన్నారు. ఈ ఘటనలో అప్పలరాజు కుమారుడిని రక్షించే ప్రయత్నంలో మరొక వ్యక్తిని కూడా నిందితుడిగా కేసులో ఇరికించిన తీరు కూటమి ప్రభుత్వ ఒత్తిడి మేరకే జరిగిందన్నారు. 32సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో ఉన్నానని, కానీ ఇటువంటి రాజకీయాలు, ఇంత అక్రమైన కేసులు ఎప్పుడూ చూడలేదన్నారు. ఉద్దానం ప్రాంత రాజకీయాలపై లోకనాథం తీవ్రంగా స్పందిస్తూ ఎక్కడో కారంచేడు నుండి అద్దెకు తెచ్చుకున్న అద్దె మైకులు ఇక్కడ రాజ్యాలు ఏలుతున్నాయని, మన సొంత నేలపై మన బిడ్డలకు న్యాయం జరగడం లేదన్నారు. మన మాటకు విలువ లేకుండా పోయిందన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో ప్రజల కోసం పనిచేసిన నాయకులు ఉండేవారని గుర్తుచేశారు. మేము ఒకసారి గౌతు వారి కంచుకోటలో జగన్నాయికులను తీసుకు వచ్చి గెలిపించుకున్నామని, అప్పటిలో స్వతంత్ర సమరయోధుడు అని మన అమాయక ప్రజలను నమ్మించారన్నారు. దానయ్య మృతి ఘటనను రాజకీయంగా వాడుకుంటున్న తీరును లోకనాథం తప్పుపట్టారు. ఆ వ్యక్తి చనిపోవడం బాధాకరమేనని, ఆ బాధను అవకాశంగా మార్చుకొని రాజకీయం చేయడం అంతకంటే బాధాకరమన్నారు. అదే పితాతోలి వద్ద చనిపోయిన వ్యక్తి గురించి ఎందుకు పట్టించుకోవడం లేదు? చట్టం అందరికీ ఒకటే కదా. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరొక న్యాయమా? అని ఆయన ప్రశ్నించారు. ఈ కేసులో అప్పలరాజు కుమారుడిపై నమోదు చేసిన అభియోగాలు నిలబడవన్నారు. అబ్బాయి విషయంలో ఏమి చేయలేరని, ఆ కేసు కూడా నిలబడదని, ఎందుకంటే ఎక్కడ ప్రత్యక్ష సాక్ష్యం లేదన్నారు. న్యాయస్థానానికి వీడియో రికార్డులు మాత్రమే సాక్ష్యం కావు. విచారణకు వచ్చినప్పుడు వంద రకాలుగా పరిస్థితులు మారిపోతాయన్నారు. ఈ ఘటన వెనుక ఉన్నది కేవలం ఒక ప్రమాదం కాదని, ఇది ఒక పథకం ప్రకారం చేసిన కుట్ర ఆరోపించారు. ఇది రాజకీయంగా కక్ష సాధింపు చర్య. ఒక పథకం ప్రకారం మత్స్యకార సామాజిక వర్గాన్ని భవిష్యత్తులో అధికారంలోకి రానివ్వకుండా రాజకీయంగా హత్య చేసేందుకు చేసిన కుట్ర ఇది. ఉద్దానం అంటే మత్స్యకారుల నేల. ఇక్కడి నుండి ఒక బలమైన నాయకుడు రాకూడదని, అందుకోసమే ఈ కుట్రలు అని ఆయన అన్నారు. అప్పలరాజు కుటుంబానికి ధైర్యం చెబుతూ లోకనాథం మాట్లాడుతూ మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగండి అప్పలరాజు. నాకు తెలిసి మీరు కూడా చాలా ధైర్యవంతులు. మేమంతా మీకు ఉన్నాం. మీకు దేవుడు కూడా తోడుగా ఉంటారు. ఈ కష్టకాలం ఎక్కువ రోజులు ఉండదు అని అన్నారు. 2029 ఎన్నికల్లో ఈ రాజకీయాలన్నీ తేలిపోతాయని లోకనాథం జోస్యం చెప్పారు. 2029 లో అన్ని సర్దుబాటు అయ్యి స్పష్టత వచ్చేస్తుందని, ఆందోళన వద్దు డాక్టర్.. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఈసారి తప్పుడు ప్రచారాలు, అక్రమ కేసులు పనిచేయవు" అని ఆయన అన్నారు. ఉద్దానం ప్రాంతంలో బయటి నుండి వచ్చి రాజకీయం చేస్తున్న వారిని గాలిలోనుండి దిగిన బృందంగా అభివర్ణించారు. త్వరలోనే విముక్తి తప్పదని అన్నారు. 365 రోజులలో ఏదో ఒకరోజు ప్రజల పక్షాన ఉంటుందని, ఆ ఒక్క రోజు చాలు. అప్పుడు అసలు నిజం బయటపడుతుందన్నారు. ఉద్దానం ప్రజలు చాలా అమాయకులు, నమ్మకస్తులు అని, అలాంటి ప్రజలను ఇక ఎవరూ మోసం చేయలేరన్నారు. ప్రాంత అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే నాయకులకే భవిష్యత్తులో అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పోలీసులు ఎవరి ఒత్తిడికి లొంగకుండా నిజాలను నిగ్గు తేల్చాలని లోకనాథం కోరారు. చట్టం ముందు అందరూ సమానమే. ధనవంతుడైనా, పేదవాడైనా ఒకటే. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. అధికారంలో ఉన్నవారు చెప్పినట్టు కేసులు, చెప్పినట్టు బెయిల్ అని ఆయన ఆరోపించారు. రాజకీయ కుట్రలో పాల్పడే వారికి ప్రజాక్షేత్రంలో ప్రజలు తమ తీర్పు స్పష్టంగా ఎన్నికల్లో ఇస్తారని, ముఖ్యంగా పలాస నియోజకవర్గంలో అభివృద్ధిని విస్మరించి రాజకీయ ప్రత్యర్థులను అడ్డు తొలగించుకునేందుకు పన్నిన కుట్రలకు భారీ మూల్యం చెల్లించుకునే రోజులు దగ్గర పడుతున్నాయని ఆయన హెచ్చరించారు.

# 24 నుంచి బాయిలింగ్ బంద్

**పలాస, జులై 21 (వార్త):** పలాస-కాశీబుగ్గ ప్రాంతంలోని జీడి పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యల నేపథ్యంలో, పలాస పారిశ్రామికవాడ జీడి ఉత్పత్తిదారుల సంఘం బంద్‌ను మంగళవారం ప్రకటించింది. పారిశ్రామికవాడ జీడి ఉత్పత్తిదారుల సంఘము అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జీడి పిక్కల ధరల పెరుగుదల, మార్కెట్‌లో అమ్మకాలు తగ్గడం, నిల్వలు పెరగడం వంటి కారణాలతో పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని సంఘం అధ్యక్షులు మల్లా రామేశం వెల్లడించారు. పరిశ్రమల పునరుద్ధరణ, కార్మికుల ఉపాధి పరిరక్షణ కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సంఘం విజ్ఞప్తి చేసింది. కొన్ని రోజులగా జీడిపిక్కలు ధరలకు జీడిపప్పుధరలకు వ్యత్యాసం కొనసాగుతూ వస్తూ, ఆ వ్యత్యాసం అధికమవ్వడంతో నష్టపోతున్నామని సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 24వ తేదీ నుండి బాయిలింగ్ నిలుపదల చేసి,10 రోజుల పూర్తిస్థాయి బంద్ పాటించాలని నిర్ణయించారు. సంఘ అధ్యక్షులు మల్లారామేశం మాట్లాడుతూ పారిశ్రామికవాడలో జీడి పరిశ్రమలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల నేపథ్యంలో, పలాస పారిశ్రామికవాడ జీడి ఉత్పత్తిదారుల సంఘము బంద్‌ను చేయడానికి ఏకబిప్రాయం నిర్మించుకున్నామని తెలిపారు. జీడి పిక్కల అధిక ధరలు, మార్కెట్లో నిల్వల పెరుగుదల, ఎగుమతుల్లో తగ్గుదల, ఉత్పత్తి ఖర్చులు పెరగడం వల్ల పరిశ్రమలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో పరిశ్రమల కొనసాగింపుకు తక్షణ చర్యలు అవసరమని సంఘం అభిప్రాయపడిందని,జీడి పరిశ్రమలపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులు, వ్యాపారులు, అనుబంధ వృత్తిదారుల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆయన వెల్లడించారు. పరిశ్రమలు బంద్ చేయాల్సిన పరిస్థితి తమకు ఇష్టంగా కాకుండా, అనివార్యంగా ఏర్పడినదని, ప్రభుత్వము,



సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని పరిష్కారం చూపాలని సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా సంఘం, జీడి పరిశ్రమల పునరుద్ధరణకు, సరైన ధరల స్థిరీకరణకు, కార్మికుల ఉపాధి భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వ్యాపారులు, కార్మికులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత విభాగాలు ఈ సంక్షోభాన్ని గమనించి సహకరించాలని సంఘం అధ్యక్షులు విజ్ఞప్తి చేశారు. ఈ సర్వసభ్య సమావేశములో కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి కొంచాడ వినయ్, ఉప అధ్యక్షులు తాలాసు శ్రీనివాస్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు తలాసు నర్సింహమూర్తి, నాగభూషణ్, కాళీప్రసాద్, జామి రామ, కొత్తకోట తిరుమల, సత్యనారాయణ, తదితరులు పాగొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

# విద్యార్థులు పోటీతత్వం అలవరుచుకోవాలి

* లక్ష్యసాధనతో దిశగా అడుగులు వేయాలి
* గురుకులాల కోఆర్డినేటర్ యలక యశోదలక్ష్మి
* గురుకులం ఆకస్మిక సందర్శన

**మందస, జులై 21(వార్త):** విద్యాభ్యాసంలో పోటీతత్వం అలవరుచుకోవాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలను సాధించగలరని ఏపీ గురుకులాల శ్రీకాకుళం జిల్లా సమన్వయకర్త యలక యశోదలక్ష్మి అన్నారు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం గురుకులంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశలోనే సక్రమైన





మార్గాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న విషయాలను సమగ్రంగా తెలుసుకోవాలన్నారు. ఓ వైపు చదువుకుంటూనే.. మరో వైపు పోటీ పరీక్షలకు కూడా ప్రిపేర్ అవుతూ, జనరల్ నాలెడ్జ్ను నేర్చుకోవాలన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, గురుకులానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు రూ.కోట్లు వ్యయం చేస్తోందని, ప్రభుత్వం నమ్మకానికి సార్థకత తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థినిలకు అందిస్తున్న భోజనం తనిఖీ చేశారు. మెస్ లోని కాయగూరలు, ఆకుకూరలు, ఇతర వంట సామాగ్రిని పరిశీలించారు. అదేవిధంగా మెనూ కూడా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు, ప్లాంటేషన్, డైనింగ్ హాల్ కూడా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి

* ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

**హిరమండలం/పాతపట్నం, జులై 21 (వార్త):** అమరావతి ఛాంపియన్‌షిప్ కప్–2026' క్రీడా పోటీలను పాతపట్నం మండలం కొరసవాడ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించి శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు అన్నారు.విద్యార్థుల జీవితంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం వంటి విలువలు క్రీడల ద్వారానే అలవడతాయని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక అవకాశాలు లభిస్తాయని తెలిపారు.రాష్ట్ర విద్య,ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ఆలోచనల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఇటువంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.క్రీడల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థి విజేతేనని,గెలుపు--ఓటములను సమానంగా స్వీకరించి మరింత ఉన్నత లక్ష్యాల కోసం కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కూటమినాయుకులు, మండల స్థాయి అధికారులు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులు, నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.







## పల్లిపేట చెత్త సంపద కేంద్రం తనిఖీ



**పోలాకి, జులై 21 (వార్త):** పోలాకి మండలం పల్లిపేట గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని డివిజనల్ పంచాయతీ అధికారి ఆర్. గోపీబాల మంగళవారం తనిఖీ చేసి వ్యర్థాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో సేకరించే తడి చెత్తను సక్రమంగా వినియోగించి వర్మీ కంపోస్టు తయారీకి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చెత్త సంపద కేంద్రంలో జరుగుతున్న నిర్వహణను పరిశీలించిన ఆమె, ప్రతిరోజూ సేకరించే తడి చెత్తను నాడేప్ పిట్స్‌లో వేసి సేంద్రియ ఎరువుగా మార్చే ప్రక్రియను క్రమం తప్పకుండా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వర్మీ కంపోస్టు తయారీ ద్వారా గ్రామ పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. అలాగే గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'పొలం పిలుస్తోంది'



**నరసన్నపేట, జులై 21(వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) వెంకట మధు, వ్యవసాయ అధికారి (ఏవో) సూర్యకుమారి తెలిపారు. మంగళవారం నరసన్నపేట మండలం చోడవరం రైతు సేవా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలు, ఎరువుల లభ్యత, పంటల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఎరువుల పంపిణీని ఏపీ ఏఐఎంఎస్ (ఉ్రా-ూా×మీా) యాప్ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎరువుల పంపిణీకి సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందించేందుకు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. రైతుల నుంచి వచ్చిన సమస్యలు, సూచనలను నమోదు చేసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణ భారతి డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



**ఇచ్ఛాపురం, జులై 21 (వార్త):** ఇటీవల విడుదలయినా డిగ్రీ 4 వ సెమిస్టర్ ఫలితాలలో స్వర్ణ భారతి విద్యార్థులు జయకేతనం ఎగుర వేశారు. అమిష కుమారి సహాని కంప్యూటర్ సైన్స్ విభాగంలో 9.75/10 పాయింట్స్ సాధించి ఇచ్ఛాపురం నియోజకవర్గం స్థాయిలో నిలిచింది. చైర్మన్ చాట్ల తులసి దాస్ రెడ్డి అభినందించారు.ఇదే విభాగంలో దేవి బేహేరా 9.54/10, ఖుషి మహరణ రాయపూడి లత ఇద్దరు 9.32/10 పాయింట్స్, జి అశోక్ 9.25/10, జానకి బేహేరా 9.2/10 పాయింట్స్ సాధించారని తెలిపారు. ప్రతి సెమిస్టర్ లో ఇలానే ఉత్తమ ప్రతిభ కనబరిస్తున్నారని ఆనందం వ్యక్తం చేసారు. వీరికి పుష్ప గుచ్ఛం తో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి చాట్ల రాము,కోఆర్డినేటర్ నీలిమ డిగ్రీ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాళ్లు కే సందీప్, జె జయప్రకాశ్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని వీరిని అభినందిచారు.

## మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**నరసన్నపేట, జులై 21 (వార్త):** మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో వెలుగు మహిళా సంఘ సభ్యులకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి మహిళ స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళల ఆర్థికాభివృద్ధితో కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో నరసన్నపేటను అత్యుత్తమ ఫలితాలు సాధించే మండలంగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాలు చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి హరిబాబు పాల్గొని మహిళా సంఘ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరికీ న్యాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన ఉండటం ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఉచిత న్యాయ సేవల కోసం జిల్లా న్యాయసేవా సంస్థ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ద్వారా అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుతుందని వివరించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని అవసరమైన సందర్భాల్లో న్యాయసేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో వెలుగు మహిళా సంఘ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## శ్రీకాకుళం

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



**ఇచ్ఛాపురం, జులై 21 (వార్త):** బెల్లుపడ జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదం లో అదే ప్రాంతానికి చెందిన బింగి బలరాం (లింగయ్య )(79) అనే వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు.పొలం పనులు చూసుకుని వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొని మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ సామజిక ఆసుపత్రికి తరలించారు. కేసును పట్టణ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానస్పద వ్యక్తులపై చర్యలు తీసుకోండి



**ఇచ్ఛాపురం, జులై 21(వార్త):** భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుష్ రంగా ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్ స్పెక్టర్ చిన్నంనాయుడుకి పట్టణంలోని పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. ఇటీవల కాలంలో ఇచ్ఛాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అనుమానాస్పద కొత్త వ్యక్తులు, అక్రమ వలసదారులు సంచరిస్తున్నట్లు స్థానిక ప్రజలు ధనుష్ రంగా దృష్టికి తీసుకు వచ్చారని, సరైన గుర్తింపు పత్రాలు లేని మరికొందరు ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇచ్ఛాపురం సరిహద్దు ప్రాంతం కావడంతో అక్రమ వలసదారులు లేదా సరైన ధ్రువీకరణ లేని వ్యక్తులు పట్టణంలో నివాసం ఉండటం వల్ల భవిష్యత్తులో ఏవైనా అవాంఛనీయ సమస్యలు తలెత్తే ఆస్కారం ఉన్నందున, స్థానిక ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అనుమానాస్పద, అక్రమ వలసదారులను సరైన గుర్తింపు కార్డులు లేని వ్యక్తులను సమగ్రంగా విచారించి, అక్రమంగా నివసిస్తున్నట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా బిజెపి యువమోర్చా తరపున పోలీసు లకు పిర్యాదు చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి యువమోర్చా జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ భైరిశెట్టి గోపి, బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ లండ నీలవేణి,యువమోర్చా సభ్యులు మహేష్, ధర్మ, అక్కు ఉమ్మిడి డిల్లీ, ధను, హరి, నాని, శ్రీను, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఈదుపురంలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



**ఇచ్ఛాపురం, జూలై 21(వార్త):** ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2లక్షల70వేల 620 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులను ఇచ్ఛాపురం రూరల్ పోలీసులకు అప్పగించారు. ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఆర్. జనార్దన్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



**ఇచ్ఛాపురం, జూలై 21(వార్త):** జగన్నాథ స్వామి రథోత్సవాలలో భాగంగా హీరా పంచమి సందర్భంగా ఇచ్ఛాపురం వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన కూచిపూడి భరతనాట్యం జానపదాలు ఒడియా సంబల్పూరి నాట్యాలు ప్రేక్షకులకు ఎంతగానో ఆకర్షించాయి. ముందుగా మహాగణపతిమ్ పాటతో మొదలైన ఈ కార్యక్రమం కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి అలివేలు మంగా పద్మావతి వేషధారణలో పలు అన్నమయ్య కీర్తనలతో పాటు రామదాసు కీర్తనలు శివుడి పాటలు. ఒరియా సంబల్పూరి జగన్నాథుని పాటలు అమ్మవారి పాటలు చివరిగా మహాలక్ష్మి అమ్మవారికి హారతి పాటలను నాట్యం చేస్తూ భక్తులను మంత్రముగ్ధులను చేశారు. నాట్య గురువు బలివాడ శృతి పట్నాయక్ అకాడమీ అధ్యక్షులు చిన్నా గురు స్వామి దంపతులు ఆధ్వర్యంలో. అకాడమీ టీచర్స్ కావ్య పూజ జయ జాగృతి జాహ్నవి పర్యవేక్షణలో. దీపిక జైత్రి సింధు రమ్య పల్లవి మధుశ్రీ నిషా మోక్ష యశస్విని జోత్స్న తనుశ్రీ లావణ్య హారిక సంజన నిహారిక స్రవంతి శ్రీ దీక్షిత ప్రణవి పూజ శోభన హేమలత ప్రజ్వలిత శ్రీనిధి రాహిత్య శ్రావ్య ఆమని భవ్య శ్రీ జెస్సికా శ్రేష్ట మహాపాత్రో సుజాత కుసుమ హారిక వర్షిని లహరి ఆశ్రిత వైష్ణవి మీరా సుమారు 45 మంది చిన్నారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ చిన్నం నాయుడు స్వర్ణ భారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్, వేదవేంద్రరావు ఆలయ సిబ్బంది పాల్గొని గురుస్వామి దంపతులకు డాన్స్ టీచర్స్ కు సాలువలతో సత్కరించారు. చిన్నారులందరికీ మెమొంటోస్ అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అలరించిన గాత్ర కచేరి



**ఇచ్ఛాపురం, జూలై 21(వార్త):** జగన్నాథ స్వామి రథోత్సవాలలో భాగంగా ఇచ్ఛాపురం దాసన్నపేటలో బాల గణపతి పూజా కమిటీ ఆధ్వర్యంలో మణికంఠ మ్యూజికల్ ఈవెంట్స్ భక్తి సంగీత విభావరి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కీబోర్డుపై హరిదాస్, హ్యాండ్ సోనిక్ పై మోహన్ పలాస, రాజేష్, ఫ్లూట్ ఢిల్లీ మాష్టార్, సింగర్ లు మణికంఠ,ఎం కే రావు,ఆశి క్రిష్ణ స్వామి లావణ్య, జయమ్మ,భక్తి గీతాలను ఆలపించారు, జయక్రిష్ణ మంచి సౌండింగ్ ని అందించారు. ఈ కార్యక్రమంలో బాల గణపతి పూజా కమిటీ పాల్గొని కళాకారులను అభినందించారు.

## నేడు 'తల్లికి వందనం' నిధుల విడుదల

**సారవకోట, జులై 21 (వార్త):** 'తల్లికి వందనం' పథకం కింద బుధవారం అర్హులైన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నిధులను రాష్ట్ర ప్రభుత్వం జమ చేయనున్నట్లు సారవకోట మండల టీడీపీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 67,47,190 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,120.78 కోట్లను నేరుగా జమ చేయడం ద్వారా విద్యకు ప్రోత్సాహం అందిందని ఆయన పేర్కొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## కొబ్బరి పంట రక్షణపై అవగాహన

**సోంపేట, జులై 21(వార్త):** ఉద్దానం ప్రాంతంలో గల కొబ్బరి పంట సంరక్షణపై కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలు మంగళవారం స్థానిక వ్యవసాయ అధికారి బి.నరసింహమూర్తితో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. గొల్లగండి గ్రామంలో ఆముదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం విషయ విజ్ఞాన నిపుణులు వి.హరికుమార్ కొబ్బరినీ ఆశించే నల్ల ముక్కు పురుగుపై అవగాహన కల్పించారు. కొబ్బరి చెట్టు నుంచి పురుగును బయటకు తీసి రైతులకు చూపించారు. చెట్ల మొవ్వుల్లో నాప్తాలిన్ గోళీలు వేసుకోవాలని సూచించారు. కొబ్బరి తోటల్లో శుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బి.స్వాతి,సిహెచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సీపీ శాంతియుత నిరసన విజయవంతం



**ఇచ్ఛాపురం, జులై 21(వార్త):** గుంటూరులో మహిళపై జరిగిన అమానుష ఘటనను తీవ్రంగా ఖండిస్తూ వైఎస్ఆర్సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం పాల్గొని విజవంతం చేయడం పట్ల శ్రీకాకుళం జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉలాల భారతి దివ్య ధన్యవాదములు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, యువ నాయకులు ధర్మాన రామ్ మనోహర్, మెంటాడ పద్మావతి , ఆముదాలవలస ఇంచార్జీ చింతాడ రవి కుమార్ , అందవరపు సూరిబాబు, రాజ్యలక్ష్మి, ధనుంజయ , సత్యనారాయణ , కామేశ్వరి , శంకర్ , ఆముదాలవలస మహిళా ప్రెసిడెంట్ ధనలక్ష్మి , శ్రీకాకుళం మహిళా ప్రెసిడెంట్ ముకుళ్ళ సుగుణ, నరసన్నపేట మహిళా ప్రెసిడెంట్ రమణి, పలాస మహిళా ప్రెసిడెంట్ సుజాత, ఎచ్చెర్ల మహిళా ప్రెసిడెంట్ మానస,ఎంపిపి, జడ్పీటీసీలు జిల్లా, నియోజకవర్గ, మండల, నగర పార్టీ నాయకులు, మహిళా విభాగం నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి, రైతు, కార్మిక, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ విభాగాల నాయకులు పాల్గొన్నారన్నారు. మహిళల భద్రతను కాపాడడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత అని పేర్కొంటూ, ఘటనలో బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయా లని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రతి మహిళకు భద్రత, గౌరవం, న్యాయం కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## జగన్నాథుని రథయాత్రలో ఎంజీఆర్





**హిరమండలం, జులై 21 (వార్త):** ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన పర్లాకిమిడిలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవంలో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు (ఎంజీఆర్) పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నియోజవర్గ ఐదు మండలాల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్షిప్ కప్ రెండవ రోజు ఎంపికలు

**పలాస, జులై 21 (వార్త):** అమరావతి ఛాంపియన్షిప్ కప్ రెండవ రోజు ఎంపికలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. 17, 23 సంవత్సరంల బాలబాలికులకు వివిధ క్రీడాంశాలలో ఎంపికలు నిర్వహించారు. బాలుర ఖో ఖో, బ్యాడ్మింటన్, చదరంగం, బాలికలకు కబడ్డీ, వాలీబాల్, లలో ఎంపికలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి రవికుమార్ అధ్యక్షత వహించగా , జిల్లా విద్యా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పి తవిటయ్య పర్యవేక్షణలో , పలాస నియోజకవర్గం క్రీడల నిర్వహణ బాధ్యులు సిహెచ్ పద్మలోచన, జిల్లా విద్యా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షులు ఎస్ రామారావు, మొదటి జోన్ కార్యదర్శి పి గజేంద్రరావు, పలాస మండల క్రీడల నిర్వహణ బాధ్యులు ఎస్ చంద్రశేఖర్, స్థానిక పాఠశాల ఉపాధ్యాయ ప్రతినిధి పి కృష్ణారావు, ఆర్ సోమేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావు, బి శంకర్రావు, నియోజకవర్గంలో పనిచేయుచున్న వ్యాయామ విద్యా ఉపాధ్యాయని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## బతికున్న వ్యక్తిని కాగితాల్లో
# చంపేసిన.. తండ్రీకొడుకులు

* భూకబ్జాలో.. సీతారాం సూత్రధారి.. నాగ్ పాత్రధారి
* తమ్మినేని కుటుంబ అక్రమాలు అందరికీ తెలిసిందే
* తాను గతంలోనే చెప్పాను * వైసీపీ నేతల భూ కబ్జాలపై సీఎం, ఆ పార్టీ నేతలు ఎందుకు మాట్లాడరు * వైసీపీ.. కబ్జా పార్టీ, గొడ్డలి పార్టీ * ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

**శ్రీకాకుళం, జులై 21 (వార్త):** భూకబ్జాలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సూత్రధారి అయితే.. ఆయన కొడుకు పాత్రధారి అని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ధ్వజమెత్తారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబమైతే.. ఏకంగా బతికున్న వ్యక్తిని కాగితాల్లో చంపేసి వారి భూమిని కబ్జా చేశారన్నారు. శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ్మినేని కుటుంబం అక్రమాలు. అవినీతిపై గతంలోనే తాను ప్రశ్నించానన్నారు. స్పీకర్ పదవికి తమ్మినేని సీతారాం అనర్హుడైని ఆనాడే చెప్పానన్నారు. ఓ సామాన్యుడు స్థలాన్ని దొంగ డాక్యుమెంట్లతోను, సర్టిఫికేట్లతో సొంతం చేసుకోవాలని తమ్మినేని కుటుంబం చూడటం అన్యాయమన్నారు. వారసులకు ఏదైనా ఆస్తిని ఇవ్వాలని అనుకుంటే చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. అంతేకాని తప్పుడుదోవలో భూములను కొట్టేసి ఇవ్వకూడదన్నారు. తన విద్యాసంస్థలో పనిచేసే వ్యక్తులు తమ్మినేని సీతారాం స్వార్థబుద్ధి కారణంగా బలైపోయారన్నారు. తమ్మినేని సీతారాం అక్రమాలపై గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఎంతుకు నోరుమెదపడం మండిపడ్డారు. జిల్లాకి చెందిన వైకాపా నేతలు, ధర్మాన సోదరులు తమ్మినేని భూకబ్జావ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దొంగల పార్టీ అన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ పార్టీ నాయకులు అడ్డగోలుగా దోచుకున్నారని, భూ కబ్జాలకు పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలో అవన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో తమ్మినేని సీతారాం వ్యవహారం బయటపడిందన్నారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడు బైకుతో ఢీకొట్టి ఓ వ్యక్తి మృతికి కారకుడై ఆ స్థానంలో మరో యువకుడును కేసులో పెట్టి సాక్ష్యాలను తారుమారు చేయాలని చేసిన ప్రయత్నాలు రాష్ట్ర ప్రజలందరికి తెలుసునన్నారు. 18 యేళ్ళ పిల్లాడు అని జగన్ సిగ్గులేకుండా మాట్లాడారన్నారు. సొంత బాబాయినే గొడ్డలితో నరికి సాక్ష్యాలను తారుమారుచేసిన చరిత్ర జగన్‌దని ప్రజలకు తెలుసనన్నారు. సాక్ష్యాలను తారుమారు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యక్తులు రాజకీయాలకు అర్హులా అని ప్రశ్నించారు. చట్టం ఏ ఒక్కరి చుట్టం కాదన్నారు. తప్పుచేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎవ్వరైనా అన్యాయంగా భూములను ఆక్రమించుకున్నా, కొట్టేసిన ఉదంతాలు ఏమైనా ఉంటే బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని కూన రవికుమార్ పిలుపునిచ్చారు. ఆ ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మొదలవలస రమేష్, పట్టణ అధ్యక్షుడు పాండ్రంకి శంకర్, కార్పొరేషన్ల డైరెక్టర్లు పిఎంజె బాబు, ప్రధాన విజయ్ రామ్ తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వంలో.. మహిళలపై దాడులు

* సభ్యసమాజం తలదించుకునేలా గుంటూరులో టీడీపీ నేతల తీరు * బాధిత మహిళలకు అండగా వైసీపీ
* వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ * అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన




**శ్రీకాకుళం, జులై 21(వార్త):** రాష్ట్రంలో మహిళలపై దాడులు అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ధ్వజమెత్తారు. గుంటూరులో మహిళను అత్యంత అమానుషంగా వివస్త్రను చేసి, వేధింపులకు గురిచేసిన దుశ్చర్యను ఖండిస్తూ మంగళవారం వైసీపీ జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కృష్ణదాస్ హాజరై మాట్లాడారు. గుంటూరు నడిబొడ్డున ఒక మహిళ పట్ల టీడీపీ నేతలు ప్రవర్తించిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పాలకుల హయాంలోనే వారిపై అఘాయిత్యాలు, వేధింపులు విచ్చలవిడిగాపెరిగిపోవడం దారుణమన్నారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు వైకాపా పోరాడుతుందన్నారు. మహిళా విభాగం ప్రతినిధులు ఎంవీ పద్మావతి, ఉల్లాల భారతి తదితరులు మాట్లాడుతూ గుంటూరు ఘటనలో ఉన్న ప్రతి ఒక్కరినీ వెంటనే అరెస్టు చేసి, చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న వేధింపులకు అడ్డుకట్ట వేసి భద్రతను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాజకీయ అండదండలతో సాగుతున్న అరాచక శక్తులపై పోలీసులు నిష్పాక్షికంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగ బద్ధంగా పౌరులకు, ముఖ్యంగా మహిళలకు కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. నిరసనలో వైకాపా యువనేత ధర్మాన రామమనోహర్‌నాయుడు, నరసన్నపేట నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గురుగుబెల్లి వెంకట రమణి, ఎం.సుగుణ, జడ్పీటీసీ రుప్ప దివ్య, ఆమదాలవలస నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్, ఎంపీపీ అంబటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచండి

* నగరపాలక సంస్థ కమిషనర్ శ్రావణ్ కుమార్
* రిమ్స్, యూజీ హాస్టల్ పరిశీలన



**శ్రీకాకుళం, జులై21 (వార్త):** 'డ్రై డే – ఫ్రైడే' కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ మంగళవారం రిమ్స్ హాస్పిటల్, యు.జి. హాస్టల్స్‌ను సందర్శించారు. పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తగిన చెత్త సేకరణ ఏర్పాట్లు చేయాలని, వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. అనంతరం రిమ్స్ హాస్పిటల్‌లోని ఆర్.ఓ. వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. తాగునీటి నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శుద్ధి చేసిన తాగునీటిని మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే హాస్టల్ వంటశాలను తనిఖీ చేసి, వంటశాల పరిసరాల్లో ఎటువంటి వ్యర్థాలు పేరుకుపోకుండా ఎల్లప్పుడూ పరిశుభ్రతను పాటించాలని, ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. దోమల వ్యాప్తి, డెంగ్యూ, మలేరియా వంటి అంటు వ్యాధులు ప్రబలకుండా నిరంతర పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, అవస రమైన చోట్ల ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని, నిల్వ నీరు ఎక్కడా లేకుండా చర్యలు తీసుకోవాలని, యాంటీ లార్వా చర్యలు చేపట్ట డంతో పాటు ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులు, హాస్టల్స్, విద్యాసంస్థలు, ఇతర ప్రజా సంస్థల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందని, నగరాన్ని పరిశుభ్రం గా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, అధికారులు, సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీలో సంబంధిత రిమ్స్ హాస్పిటల్ ఆర్ఎంఓ, అసిస్టెంట్ ఆర్ఎంఓ, అధికారులు, వైద్యశాఖ అధికారులు, నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్య రక్షణకే మల నమూనాల సర్వే



**శ్రీకాకుళం, జులై21 (వార్త):** పాఠశాల విద్యార్థుల్లో నులిపురుగుల నివారణ, శారీరక ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగానే ప్రత్యేక సర్వే చేపడుతున్నామని జిల్లా ఇన్చార్జి వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్సీడీసీ) ఆదేశాల మేరకు జిల్లాలో మల సంబంధిత నులిపురుగుల సంక్రమణ (ఎస్టీహెచ్) సర్వే బుధవారం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శివ రంజని పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగిందని వెల్లడిం చారు. ఈ సర్వేలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన ఎంఈఎస్ మహాలక్ష్మీనగర్, ఎంఈఎస్ హడ్కో కాలనీ, ఎంఈఎస్ బాలగ, ఎంఈఎస్ బొందిలిపురం పాఠశాలలకు చెందిన నాలుగో, ఐదో తరగతి విద్యార్థుల నుంచి మల నమూనా లను సేకరించినట్లు వివరించారు. ఎన్సీడీసీ పరిశోధన సహాయకులు డాక్టర్ జి. జగదీష్, సాంకేతిక నిపు ణులు సత్తిబాబు, ఐసీ సర్వే ప్రతినిధి రామకృష్ణ నేతృత్వంలోని వైద్య బృందం, పాఠశాలల ప్రధా నోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారంతో ఈ ప్రక్రియ పూర్తి చేశారు. సేకరించిన నమూనాలను ఎన్సీడీసీ మార్గదర్శకాల ప్రకారం భద్రపరిచి, తదుపరి ప్రయోగశాల పరీక్షల నిమిత్తం అందజేసినట్లు స్పష్టం చేశారు.

## బీహెచ్ఆర్సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం




**బూర్జ,జులై21(వార్త):** భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (బీహెచ్ఆర్సీ) బూర్జ మండల అధ్యక్షులు వావిలిపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో హరి ప్రసాద్ కిడ్నీ సెంటర్ సహకారంతో కొల్లివలస గ్రామంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఆసుపత్రికి చెందిన వైద్యుడు, బీహెచ్ఆర్సీ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రభు, హాస్పిటల్ సిబ్బంది కృష్ణ, మౌనిక, కుమారి,వైద్య పరీక్షలు చేసి రోగులకు ఉచి తంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీహెచ్ఆర్సీ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ బీహెచ్ఆర్సీ సంస్థ ఏర్పడిన నాటి నుంచి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఈ సంస్థ ఆధ్వర్యంలో మారుమూల పల్లెలు, గిరిజన, మత్స్యకారప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహించి ప్రజలకు చేరువగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. అలాగే భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరఫున మానవ హక్కులపై అవగాహన కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహించ డంలో ముందంజలో ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హేమంత్, మన్యం జిల్లా ప్రెసిడెంట్ ప్రభాస్, బూర్జ మండలం భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, సభ్యులు చక్రధర్, లక్ష్మణరావు, భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## వామన అవతారంలో జగన్నాథుడు



**శ్రీకాకుళం, జులై21(వార్త):** జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఇల్లిసిపురం రైతుబజార్ జంక్షన్ వద్ద ఉన్న గుండిచా మందిరంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రదేవిలకు ఆలయ ప్రధాన పూజారి సుభాష్ చంద్ర పండా ప్రత్యేక పూజలు చేశారు. జగన్నాథస్వామిని వామన అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా బాలు పాణిగ్రాహి, ఒరియా బ్రాహ్మణ సంఘ నాయకులు సహాయ సహకారాలు అందించారు.

## పొగాకు రైతులను ఆదుకోండి

**శ్రీకాకుళం, జులై 21 (వార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సహచర మంత్రులు, ఎంపీలతో కలసి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ని పార్లమెంట్‌లో కలిసి ముడి పొగాకుపై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం జీఎస్టీని 28 శాతానికి తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి, రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ముడి పొగాకు సంబంధించిన అంశమని, తయారైన పొగాకు ఉత్పత్తులకు దీనికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జీఎస్టీ పెంపు కారణంగా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఎఫ్‌సీవీ పొగాకు విలువపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీని 40 శాతం నుంచి 28 శాతానికి తగ్గించాలని కోరారు. ఈ నిర్ణయం ద్వారా పొగాకు రైతులు, డీలర్లు, ఎగుమతిదారులకు ఉపశమనం లభించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో భారత పొగాకు ఎగుమతుల పోటీతత్వం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస రాజు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురంధేశ్వరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బస్తీపాటి నాగరాజు, బీద మస్తానీ రావు, తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546